తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ

● పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్

నల్లకుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో టీడీపీ పూర్వ వైభవం పై పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై పార్టీశ్రేణులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె. దశరథ్ అన్నారు. ఏపీతో పాటు తెలంగాణ రాష్ట్రంలో పార్టీకి తగు సమయం కేటాయిస్తామని పేర్కొనడంతో తెలుగు తమ్ముళ్లలో నూతన నోత్తేజం వెల్లివిరుస్తున్నదని అన్నారు. శుక్రవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, త్వరలో తెలంగాణలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని, ఇందుకు పార్టీశ్రేణులు సిద్ధం కావాలని పార్టీ అధినేత చంద్రబాబు పిలుపునివ్వడంతో తెలంగాణలో టీడీపీ బలమైన శక్తిగా అవతరించనున్నదని అన్నారు. త్వరలో తెలంగాణ టీడీపీ అధ్యక్షుడిని నియమిస్తామని పేర్కొనడంతో పార్టీ మరింత బలోపేతం కానున్నదన్నారు.

మాలలను ఏకీకృతం చేయడమే 'బస్తీబాట' లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మన్నె శ్రీధర్ తదితరులు

నల్లకుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మాల వర్గాలను ఏకీకృతం చేయడమే లక్ష్యంగా మాలల బస్తీ బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ కన్వీనర్లు మన్నె శ్రీధర్, పి. బల్వంత్‌రావు, కో-కన్వీనర్ తాలుకా రాజేష్‌లు వెల్లడించారు. శుక్రవారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ, రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టులో తమ పోరాట యాక్షన్ కమిటీ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) వేస్తున్నదని అన్నారు. ఈ మేరకు నగరంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో సుప్రీంకోర్టు వర్గీకరణపై ఇచ్చిన తీర్పుతో మాలలను చైతన్యవంతులను చేయడానికి మాలల బస్తీ బాట కార్యక్రమం యాక్షన్ కమిటీ శ్రేణులు నిత్యం మాల వర్గాలను ఏకీకృతం చేయడానికి కృషి చేస్తుందన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను పేదలు సద్వినియోగం చేసుకోవాలి



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న డాక్టర్ గౌతమ్‌రావు

బర్కత్‌పుర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ నిధి చెక్కులను పేదలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు అన్నారు. బర్కత్‌పురకు చెందిన యదార్థ (24) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని చికిత్స కోసం కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సిఫార్సుతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 60 వేలు మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును శుక్రవారం బీజేపీ నగర కార్యాలయంలో లబ్ధిదారుడు తల్లి సహనీ ప్రభకు అందజేశారు. కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు కృష్ణకుమార్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నల్లకుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 95వ బీపీ - షుగర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కె. వీరయ్య తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం పక్కన హైదరాబాద్ జిందాబాద్ సంస్థ కార్యాలయంలో ఈ ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ప్రస్తుతం వేలాది రూపాయల ఖర్చు లేకుండా రూ. 100కే నెలకు సరిపడా జనరిక్ మందులు పంపిణీ చేస్తామన్నారు. ఇతర వివరాల కోసం 9949821177 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

'ఉచితంగా పార్కింగ్ సదుపాయం కల్పించాలి'

చిక్కడపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైల్ ప్రయాణికుల నుంచి పార్కింగ్ చార్జీల వసూళ్లను మెట్రోసంస్థ, ఎల్ అండ్ టీ సంస్థలు తక్షణమే ఉపసంహరించుకొని ఉచితంగా పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయా సంఘాల ప్రతినిధులు ధర్మేంద్ర, శ్రీకాంత్, రమేష్, జావిద్, ప్రదీప్ తదితరులు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

షాపింగ్‌మాల్స్‌లో స్పై కెమెరాలతో అప్రమత్తంగా ఉండాలి


చిక్కడపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): షాపింగ్ మాల్స్, పబ్లిక్ ప్రదేశాల్లో స్పై కెమెరాలతో అప్రమత్తంగా ఉండాలని చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సూచించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని అరోరా డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం ఆయన స్పై కెమెరాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సీతయ్య మాట్లాడుతూ, సరికొత్త టెక్నాలజీతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారని, ముఖ్యంగా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. గుర్తుతెలియని ఫోన్ నెంబర్లకు, మొబైల్ ఫోన్లలో వచ్చే అవసరం లేని లింకులకు స్పందించవద్దని అన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, చంద్రకళ, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీని ఉపసంహరించుకోవాలి

● ఆలిండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్

బర్కత్‌పుర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : హెల్త్ ఇన్సూరెన్స్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన 18 శాతం జీఎస్టీని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆలిండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జె.గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి కె. విజయ్‌భాస్కర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి పీవీ సుబ్బారావు, కార్యదర్శి ఎ.సంజయ్‌నారాయణ, గ్రేటర్ అధ్యక్షుడు ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ, దేశంలోని ప్రధానమైన ఐదు ఇన్సూరెన్స్ కంపెనీలను కలిపి ఒకే కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకుని 1995లో తీసుకొచ్చిన పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి ఈ నెల 31, సెప్టెంబర్ 1న హిమాయత్‌నగర్‌లో పెన్షనర్ల జాతీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలిపారు.

గణేష్ ఉత్సవ సమితి భోలక్‌పూర్ కన్వీనర్‌గా పృథ్వీరాజ్



పృథ్వీరాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న వినయ్ కుమార్

ముషీరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి భోలక్‌పూర్ డివిజన్ కన్వీనర్‌గా బీజేపీ నాయకుడు పృథ్వీరాజ్ నియమితులయ్యారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో జరిగిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశంలో పృథ్వీరాజ్‌కు ఉత్సవ సమితి ము షీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శనివారం సా యంత్రం 6.30గంటలకు ముషీరాబాద్‌లోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ గణేష్ మండప నిర్వాహకులతో పెద్ద ఎత్తున సమావేశం నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. మండప నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు మద్దూరి శివాజీ, మహేందర్‌బాబు, శక్తిసింగ్, అనిల్ పాల్గొన్నారు

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలి

● పాఠశాల విద్యాశాఖ సంచాలకులు వెంకటనర్సింహారెడ్డి

కవాడిగూడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు వెంకటనర్సింహారెడ్డి అన్నారు. దోమలగూడలోని పింగళి వెంకట్‌రాంరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు ఉద్యోగ విరమణ సన్మాన సభ.. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ, కమలాకర్‌రావు విద్యారంగానికి విశిష్ట సేవలందించారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు ప్రతి నెల ఒకటో తారీఖున వేతనాలు అందిస్తూ బదిలీలు, పదోన్నతులు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులతోపాటు బకాయిపడ్డ కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సభలో మాజీ ఎమ్మెల్సీలు బి. మోహన్‌రెడ్డి, పూల రవీందర్, మాజీ బాధ్యులు వెంకట్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు సదానంద్‌గౌడ్, లింగారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, అబ్దుల్లా, రాఘవరెడ్డి, రాజగంగారెడ్డి, విజయసాగర్, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

● పీడీఎస్‌యూ డిమాండ్ ● ఇందిరాపార్కు వద్ద ధర్నా ● 'గురుకుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ



ధర్నాలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పీడీఎస్‌యూ నేతలు

వాడిగూడ , ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలు సమస్యలకు చిరునామాగా మారాయన్నారు. గురుకులల్లోని సమస్యలను పరిష్కరించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భువనగిరి మధు అధ్యక్షతన శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఫుడ్ పాయిజన్, విషజ్వరాల బారిన పడి మృత్యువాత పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించడం లేదని, విద్యార్థులకు కనీస వసతులు కల్పించడం లేదని విమర్శించారు. అన్ని గురుకుల పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మైన శ్రీనివాస్, ముత్యాల రవీందర్, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు భువనగిరి మధులు మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ధర్నాలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ప్రణయ్, మంద నవీన్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి మామిడాల మహేష్, రాష్ట్ర నాయకులు తీగల శ్యామ్, మాదారం నాగరాజు. మామిడాల ప్రవీణ్, సందీప్, యశ్వంత్, జాన్సి, మహేష్‌రాజు తదితరులతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



భోలక్‌పూర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాకేష్

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ముషీరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో విషజ్వరాలు విస్తరిస్తున్నాయని ప్రజలు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ రాకేష్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200ల మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 28మందికి జ్వరం ఉన్నట్లు డాక్టర్ రాకేష్ తెలిపారు. డెంగ్యూ, మలేరీయా కేసులు లేవని, ప్రజలు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.ఆసుపత్రి ఏఎన్ఎం లక్ష్మీబాయి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అష్టైశ్వర్య లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు



శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని తిలక్‌నగర్‌లోని శ్రీసౌభాగ్యదాయిని అష్టైశ్వర్య లక్ష్మీదేవీ ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో భాగ్యరేఖ, తోట భవానీ, దేవిస్వామి, శర్వారీ జగన్, సునీత, అనురాధ, ఉదయశ్రీ, సంతోషి, శైలజ, పద్మ, చంద్రకళ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. పార్శిగుట్ట 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఫిష్‌మార్కెట్, మోహన్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు, మదర్‌డైరీ, ఆజామాబాద్ పరిధిలోని రామ్‌నగర్, లక్ష్మమ్మ పార్క్, శ్రీనివాసా టెక్స్‌టైల్స్ ప్రాంతాల్లో 11 నుంచి 11.30 గంటల వరకు సరఫరా ఉండన్నారు. అలాగే, ప్రివెంటివ్‌మెడిసిన్, సంజీవయ్యనగర్, తిలక్‌నగర్ పరిధిలోని నారాయణగూడ వాటర్‌వర్క్స్, శాంతిథియేటర్, తిలక్‌నగర్, 6 నెంబర్ క్రాస్‌రోడ్ ప్రాంతాల్లో 11.30 నుంచి 1.30 వరకు, నెహ్రూనగర్ పరిధిలోని గోల్నాక చర్చ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు సరఫరా ఉండదని ఏడీఈ తెలియజేశారు.

టీఆర్‌టీలో సివరేజీ వ్యవస్థ మెరుగునకు చర్యలు



టీఆర్‌టీ క్వార్టర్స్‌లో సివరేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్, జలమండలి అధికారులు

చిక్కడపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్‌లోని టీఆర్‌టీ క్వార్టర్స్‌లో సివరేజీ సమస్యను మెరుగుపర్చేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ తెలిపారు. టీఆర్‌టీలో మురుగు ఓవర్‌ఫ్లో సమస్య వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఫిర్యాదు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె శుక్రవారం కార్పొరేటర్ జలమండలి అధికారులు, బీజేపీ నాయకులతో కలిసి స్థానికంగా పర్యటించి సమస్యను పరిశీలించారు. తరచూ డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతుండటంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన, దోమల వృద్ధితో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నట్టు స్థానికులు తమ ఫిర్యాదు చేస్తున్నారని ఆమె జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌లకు వివరించారు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో ఎక్కడా కూడా నీరు నిలిచిపోకుండా వాటిలోని మట్టిని తొలగించాలని జలమండలి సిబ్బందికి కార్పొరేటర్ ఆదేశించారు. డివిజనలోని రోడ్లు, బస్తీలు, కాలనీలలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. బీజేపీ నేతలు వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, సురేష్, నవీన్‌కుమార్, దోనేటి సత్యం, సాయికుమార్, ఆనంద్‌రావు, శివకుమార్, స్థానికులు కృష్ణ, ప్రకాష్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ అండతో హుడా సాయినగర్‌లో రోడ్డు ఆక్రమణ

● ఫిర్యాదు చేసినా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు

● 'హైడ్రా'కు ఫిర్యాదు చేసిన స్థానికులు



రోడ్డును ఆక్రమించిన ఫొటోలను చూపిస్తున్న కొంతం మల్లారెడ్డి

బర్కత్‌పుర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : హయత్ నగర్ సర్కిల్ 3 పరిధిలోని వనస్థలిపురం హుడా సాయినగర్‌లో స్థానిక కార్పొరేటర్ అండదండలతో వ్యాపారవేత్త రమణారెడ్డి రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మించినా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని అదే ప్రాంతానికి చెందిన కొంతం మల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, దశరథరెడ్డిలు ఆరోపించారు. రెండు వైపులా దాదాపు 200 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి గోడ నిర్మించారని, దీని వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, స్థానిక ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. ఈ ఆక్రమణలపై డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్లకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపించారు. దీనిపై కోర్టును ఆశ్రయించగా ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించినప్పటికీ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వారన్నారు. హైడ్రాకు కూడా ఫిర్యాదు చేశామని, దీంతో తమపై కక్ష కట్టి బీజేపీ కార్పొరేటర్, వ్యాపారవేత్త రమణారెడ్డిలు చంపుతామని తమను బెదిరిస్తున్నారని, వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని ఆం దోళన వ్యక్తం చేశారు.

సమాజహితాన్ని కోరే తిలక్ రచనలు



నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్, జనార్దనమూర్తి

చిక్కడపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బాలగంగాధర తిలక్ రచనలు కథలు, కవిత్వం సమాజహితాన్ని కోరతాయని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా శుక్రవారం రాత్రి ప్రముఖ అభ్యుదయ రచయిత దేవరకొండ బాలగంగాధర తిలక్ యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. శ్రీనివాస్‌గుప్తా ముఖ్యఅతిథి పాల్గొని తిలక్‌కు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తిలక్ రాసిన సాహిత్యం రాశిలో కొంచెమే అయినా.. వాసిలో మాత్రం అపురూపమని అన్నారు. తొలిరోజుల్లో దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రభావంతో భావకవిత్వం వైపు పయనించినా తర్వాత కాలంలో సామాజిక చైతన్య ఆలోచనలతో అభ్యుదయ కవిత్వంలో మేటిగా తిలక్ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. సాహితీకిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ, వచనకవితా ఉద్యమంలో కుందుర్తికి సహచరుడు తిలక్ అన్నారు. చిన్నవయసులోనే ఆయన మృతి తెలుగు సాహిత్యానికి తీరనిలోటు అన్నారు. కళాభిమాని వెంకటరావు, గాయని గరిమెళ్ల సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని స్పృహకోల్పోయిన వాచ్‌మెన్

బర్కత్‌పుర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతున్న వాచ్‌మెన్‌ను వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో స్పృహతప్పి పడిపోయాడు. కాచిగూడ పీఎస్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. వివరాలు... బర్కత్‌పురలోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పి.సైదులు (50) శ్యామలదేవీ డిగ్రీ కళాశాల ఎదురుగా రోడ్డు దాటుతుండగా బర్కత్‌పుర చౌరస్తా నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టి వెళ్లి పోయాడు.ఈ ప్రమాదంలో సైదులు స్పృహ కోల్పోయి రోడ్డుపై పడిపోయాడు. అక్కడ ఉన్న కొంతమంది యువకులు సైదులును పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌పైకి తీసుకువచ్చి పడుకోబెట్టారు. సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు గాయాలతో ఉన్న సైదులును ఆస్పత్రికి తరలించారు. భార్య తిరుమలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి ఢీకొట్టిన వాహనదారుడిని గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

ఆకతాయిల వేధింపులపై షీటీమ్స్‌కు ఫిర్యాదు చేయండి



కార్యక్రమంలో పాల్గొన్న షీ టీమ్ ఏసీపీ ప్రసన్నలక్ష్మి, సీఐ ధనలక్ష్మి తదితరులు

బర్కత్ పుర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వే ధింపు లపై విద్యార్థినీలు నేరుగా ఫిర్యాదు చేయాలని షీ టీమ్ ఏసీపీ ప్రసన్నలక్ష్మి కోరారు. శుక్రవారం బర్కత్‌పురలోని ఆర్‌బీవీఆర్ ఫార్మసీ కళాశాలలో షీటీమ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకతాయిల వేధింపులు అధికమయ్యాయని, దీనిపై షీటీమ్స్‌కు నేరుగా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ సమయంలో నైనా ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చన్నారు.టీనేజ్‌లో బాలికలు ఇష్టానుసారంగా వ్యవహరించవద్దని, భవిష్యత్ లక్ష్యాలపై దృష్టిపెట్టాలన్నారు. సీఐ ధనలక్ష్మి, ఎస్ఐ ఉమామహేశ్వరి, ఏఎస్ఐ విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జెమినీ కాలనీ పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రాంనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సంఘం రాంనగర్, శ్రీవాసవీ స్వర్ణ నిధి రాంనగర్, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన ఉదయం 7. 30 గంటలకు జెమినీ కాలనీ శ్రీపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. రాంనగర్‌లో సంఘాల ప్రతినిధులు వెనిశెట్టి సుధాకర్ గుప్తా, నేతి సత్యనారాయణ, చందా ప్రకాష్ గుప్తా, ఎర్రం శేఖర్, ఎర్రం శ్రీనివాసులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీపోచమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజల్లో భాగంగా అభిషేకం, సామూహిక కుంకుమార్చన, పుష్పార్చన జరుగుతుందని, మహిళలందరూ పాల్గొనాలని కోరారు.

వీధిదీపాల సమస్యలను పరిష్కరించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో వీధి దీపాల సమస్యను పరి ష్కరించాలని తెలంగాణ జనసమితి ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ అధికారులను కోరారు. అశోక్‌నగర్, గాంధీనగర్, అన్నానగర్, అరుంధతినగర్, సబర్మతినగర్, అశోక్‌నగర్ పార్కు 1 ప్రాంతాల్లో గత రెండునెలలుగా వీధిదీపాలు వెలగడంలేదని తెలిపారు. పలుమార్లు జీహెచ్ఎంసీ విద్యుత్‌విభాగం వారికి ఫిర్యాదులు చేశామని సిబ్బంది కొరతవల్ల సమస్య పరిష్కరించలేకపోతున్నామని అధికారులు సమస్యను దాటవేస్తున్నారని ఆయన ఆరోపించారు. అసలే అధ్వాన్నంగా ఉన్న రోడ్లపై రాత్రివేళల్లో వృద్ధులు, పిల్లలు, మహిళలు నడవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని చోరీలు, చైన్‌స్నాచింగ్‌లుజరిగే ప్రమాదం కూడా ఉందని అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కాచిగూడలో రూ.1.29 కోట్లతో అభివృద్ధి పనులు

● జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు



నిధుల విడుదల పత్రాన్ని చూపిస్తున్న దిడ్డి రాంబాబు

బర్కత్‌పుర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో కోటి ఇరవై తొమ్మిది లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అ ధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా ఈ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలోని తన నివాసంలో చే పట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. కుత్బీగూడలో 20 లక్షల 25 వేల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రెడ్డి కళాశాల బాలికల హాస్టల్ నుంచి లింగంపల్లి వ రకు 9 లక్షల 75 వేల రూపా యలతో సీసీ రోడ్డు నిర్మాణం, చప్పల్‌బజార్ శ్రీహనుమాన్ మందిరం వద్ద 30 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులు, నారాయణగూడ వైఎంసీఏ వద్ద 48 లక్షల 60 వేల రూపాయలతో డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణం, బర్కత్‌పుర వద్ద 21 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

జల్సాల కోసం చోరీలు

● ముగ్గురి అరెస్ట్ ● 9 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

అమీర్‌పేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న వ్యక్తితోపాటు వాటిని కొనుగోలు చేస్తున్న ఇద్దరిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏసీపీ వెంకటరమణ శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా పామల్లాపురం గ్రామానికి చెందిన బండ్లమూడి చిన్న అవులయ్య(30) ఎర్రగడ్డలో నివసిస్తూ మెట్రోస్టేషన్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవాడు. కొవిడ్ సమయంలో స్వగ్రామానికి వెళ్లిపోయాడు. తిరిగి 2023లో నగరానికి వచ్చి గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో కొంతకాలం సెక్యూరిటీగార్డుగా పనిచేశాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. ఖర్చులకు డబ్బులు సరిపో కపోవడంతో చోరీల బాట పట్టాడు. ఎస్ఆర్‌నగర్, బాహునగర్ పరిసర ప్రాంతాల్లో హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడు. వీటిని నేరేడ్‌మెట్‌లో సెల్‌ఫోన్ మరమ్మతుల షాపు నిర్వహిస్తున్న ప్రకాశం జిల్లా బెస్తవారిపేటకు చెందిన వెంకటకృష్ణ(33), అంబర్‌పేటలో ఉంటున్న బెస్తవారిపేటకు చెందిన మేకల వెంకటేశ్వర్లు(30)కు విక్రయించేవాడు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు అమీర్‌పేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అవులయ్య, వెంకటకృష్ణ, వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2.13 లక్షల విలువైన 9 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను రి మాండ్‌కు తరలించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డీఐ గోపాల్,ఎస్ఐ రాజురాథోడ్ పాల్గొన్నారు.

పర్యావరణ అనుకూలంగా ఫ్యాషన్ ఉండాలి

● వై ఫ్లో సదస్సులో వక్తలు



సమావేశంలో పాల్గొన్న వక్తలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ పరంగా నూతనంగా ఏది సృష్టించినా అది పర్యావరణంపై ప్రభావం చూపుతుందని బెహ్నో న్యూయార్క్ ఫౌండర్ శివమ్ పుంజ్యా అన్నారు. తన దృష్టిలో సస్టెయినబల్ ఫ్యాషన్ అంటే నిజాయితీగా ఉండటమేనన్నారు. శుక్రవారం మాదాపూర్‌లో యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వై ఫ్లో) ఆధ్వర్యంలో సస్టెయినబల్ ఫ్యాషన్‌పై రౌండ్ టేబుల్ చర్చ జరిగింది. వ్యాపారవేత్త పింకీరెడ్డి, ఫ్యాషన్ డిజైనర్ గౌరంగ్ షా, కాన్షియస్ ఎఫర్ట్ ఫౌండర్ సాచిబాల్ పాల్గొన్నారు. ప్రపంచమంతా ఇప్పుడు ఫ్యాషన్ వైపు చూస్తోందని గౌరాంగ్ షా అన్నారు. ఇక్కడ లభించినంత చేనేత వస్త్ర వైవిధ్యం మరెక్కడా లభించదని పేర్కొన్నారు. వై ఫ్లో చైర్‌పర్సన్ రిద్ధి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కేవలం ఒకశాతం వస్త్రాలు మాత్రమే రీసైకిల్ చేస్తుండడం ఆందోళనకరమన్నారు.

కవితపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

● సైబర్‌క్రైం పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ కవితపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అధికార కాంగ్రెస్‌కు చెందిన సోషల్ మీడియా విభాగాలతోపాటు ఆ పార్టీ నాయకుల సోషల్ మీడియా ఖాతాల్లో అసభ్యకర పోస్టింగ్‌లు చేస్తున్నారని అందులో పేర్కొన్నారు.

గణేష్ మండపాల వద్ద చెట్ల కొమ్మల తొలగింపు

ముషీరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని శివాలయం చౌరస్తా భరత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను శుక్రవారం జీహెచ్ఎంసీ సిబ్బంది యంత్రాల సహాయంతో తొలగించారు. ఈ పనులను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ముషీరాబాద్ డివిజన్ కన్వీనర్ రాజేష్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు కుషాల్‌గౌడ్, ఆయూష్, రాహుల్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086, పున్నారావు: 9985921366